క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: కంచన పుత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం వైద్యాధికారి దివాకర్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందన్నారు. టీబీ నిర్ధారణకు ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా గల్ల పరీక్షలు చేస్తారని తెలిపారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సత్యవేడు: వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి సమస్య పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, విద్యుత్ ఏఈ, ఈఓపీఆర్డీ కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. జల జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికి తాగునీరు పనులు పూర్తి అయిన గ్రామాల గురించి ఆరా తీశారు.

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

సత్యవేడు: విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై మక్కువ, అభిరుచి పెంపొందేలా సృజనాత్మకంగా విద్యాబోధన చేయాలని ఎంఈఓ కే.రవి అన్నారు. గురువారం ఆయన స్థానిక బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వేసవిలో విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. హెచ్‌ఎం మణి, ఉపాధ్యాయులు గౌరి, మంజుల పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు వద్ద గురువారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీ ముమ్మరంగా నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఇబ్రహీం మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, నగదు రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రమేష్ పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ గోడౌన్‌కు స్థలం కేటాయింపు



స్థల పరిశీలన చేస్తున్న ఏజీఎం, తహసీల్దార్

పిచ్చాటూరు: నూతన సివిల్ సప్లైగోడౌన్ నిర్మాణానికి 1.10 ఎకరం భూమిని కేటాయించినట్లు తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. గురువారం జిల్లా పౌరసరఫరాల ఏజీఎం రమేష్‌తో కలిసి గోడౌన్ నిర్మాణానికి కేటాయించిన పిచ్చాటూరు సంక్షేమ హాస్టల్‌ను ఆనుకుని ఉన్న స్థలా న్ని తహసీల్దార్ పరిశీలించారు. స్థలం హద్దులను పౌరసరఫరాల అధికారులకు చూపినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశన్, సర్వేయర్ కన్నయ్య, నేతలు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడలో ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: వేసవి సెలవుల నేపథ్యంలో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు తైక్వాండో క్రీడలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్ డాక్టర్ కె.గోపినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్‌లోని తైక్వాండో శిక్షణ కేంద్రంలో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8గంటల వరకు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఒలింపిక్స్ గుర్తింపు పొందిన తైక్వాండో ఆత్మ రక్షణ క్రీడ అని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 95731 44231, 81217 71968 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సంక్షేమ ప్రదాతను ఆశీర్వదించండి



కారిపాకంలో ప్రచారం చేస్తున్న రాజేష్



వితయ్యపాళెంలో ప్రచారం నిర్వహిస్తున్న నూకతోటి రాజేష్

- సత్యవేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్
- ఫ్యాను గుర్తుకే ఓటు వేసి గెలిపించండి
- జోరుగా ఎన్నికల ప్రచారం

వరదయ్యపాళెం: సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి మీ చల్లని దీవెనలు అందించాలని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ కోరారు. మండలంలోని కారిపాకం, పులివల్లం, బీఎస్‌పేట, వితయ్యపాళెం, బత్తలవల్లం గిరిజనకాలనీ గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు మద్దతు పలకాలని స్థానికులను కరపత్ర ప్రచారంలో అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానికులు, పార్టీ శ్రేణులు నూకతోటి రాజేష్‌కు ఘనస్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎంపీ అభ్యర్థిగా మద్దెల గురుమూర్తిని, తనను ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు నిరంతరం నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్లను విమర్శించే నైతిక హక్కు టీడీపీ నాయకులకు లేదని, రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. మోసకారి చంద్రబాబును నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, జిల్లా కార్యవర్గ సభ్యు డు బందిల సురేష్, మండల ప్రచార కమిటీ కన్వీ నర్ భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి విజయ్‌కుమార్, సీనియర్ నేత భానుప్రకాష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు గిరిరెడ్డి, శీనురెడ్డి, ఎంపీటీసీలు మధుసూదన్, కస్తూరి, సర్పంచులు ఆనంద్, బాలకృష్ణ, లోకేశ్వరి, శివారెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కోకన్వీనర్ శోభన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్లలో ఏంచేశారో చెప్పండి?



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అంజూరు తదితరులు

- టీడీపీ నేతలకు ఎమ్మెల్యే సవాల్
- మీరు చేయలేని అభివృద్ధి మూడేళ్లలోనే చేశా
- నియోజకవర్గం అభివృద్ధిపై బుక్‌లెట్ ఆవిష్కరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని 30 సంవత్సరాలు పాలించిన టీడీపీ నేతలు చేయని అభివృద్ధి కేవలం మూడేళ్లలోనే వందరెట్లు తాను చేసి చూపించానని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై అవాకులు చెవాకులు పేలుతున్న టీడీపీ నేతలు 3 దశాబ్దాల్లో నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధికి సంబంధించి గురువారం బుక్‌లెట్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రాజకీయ చరిత్రలోనే మొదటిసారిగా గత పాలకులకు సవాల్ విసురుతున్నట్టు ఆయన చెప్పారు. తానేం చేశానో అభివృద్ధి గురించి బుక్‌లెట్ చెబుతుందని చెప్పారు. ఈ బుక్‌లెట్‌తోనే ప్రజల్లోకి వెళ్లి ప్రజలను ఓట్లు కోరుతామన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మిద్దెల హరి, నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, గయాజ్, ఆర్కాడు ముత్తు, మధు, అమర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్రి గెలుపు కోసం తనయ ప్రచారం



ప్రజలు పొందిన లబ్ధిని తెలియజేస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ప్రతి ఇంటికి జగనన్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన కుమార్తె పవిత్రారెడ్డి కోరారు. గురువారం మండలంలోని వేలవేడు పంచాయతీలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. తొలుత ఆమె అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కరపత్ర ప్రచార చేస్తూ ప్రజలతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడమే కాకుండా అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇక కరోనా కష్టకాలంలో ప్రతిపక్ష నాయకులు ప్రజలకు ముఖం చాటేసినా, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాత్రం నిరంతరం ప్రజలకు ఎంతో సేవ చేసి వారికి అండగా నిలిచారన్నారు. నాలుగేళ్లుగా ప్రజలకు చెంతకు ఏరోజూ రాని నాయకులు తీరా ఎన్నికల సమయంలో ప్రత్యక్షమై తమను గెలిపించాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని, ఇది గుర్తెరిగి ప్రజలు ఓట్లతో వారికి బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, నాయకులు భానుమూర్తియాదవ్, గురునాథ్, బాలమ్మ, మణి, గుణశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, చెంచుకృష్ణ, జనార్ధన్, శేషగిరి, రత్నం, వెంకటేశ్వర్లు, తిరుపాల్, బ్రహ్మయ్య, చెంచు మోహన్‌యాదవ్, గురవయ్య, సిద్ధయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో..



గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద కరికాలవలవన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాలవలవన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈవో ఎస్వీ నాగేశ్వరరావు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం పలికి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

‘సేవాభావం పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్’



ప్రశంసా పత్రాలతో సౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

శ్రీకాళహస్తి: సమాజంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన రోవర్లు, రేంజర్ల పాత్ర చాలా కీలకమని, ఆసక్తి కలిగిన సంస్థలో చేరాలని జిల్లా రోవర్ల కార్యాలయం కమిషనర్ రమేష్‌బాబు కోరారు. శ్రీకాళహస్తిలోని ఎస్వీయే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, డిగ్రీ విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి ఉత్తమ పౌరులుగా మారాలన్నారు. ప్రిన్సిపల్ శ్రీలత మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సేవాభావం పెంపొందించడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రుడు, లీడర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా రాజగోపాల్‌రెడ్డి



అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌తో ఆర్‌పీఎఫ్ సీఐ మధుసూదన్‌రావు

రేణిగుంట: రేణిగుంట రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా రాజగోపాల్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను తిరుపతి ఆర్‌పీఎఫ్ సీఐ మధుసూదన్‌రావు, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు. రైల్వే భద్రతపై సమీక్షించారు.

ప్రజలకు మేమెప్పటికీ సేవకులమే..!



వెదుళ్లచెరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న శ్రీవాణిరెడ్డి

- మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి



వెదుళ్లచెరువులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని మూడు దశాబ్దాల పాటు పాలించిన బొజ్జల కుటుంబం ప్రజలకు చేసిందేమీ లేదని, తన భర్త గెలిచి నాలుగన్నరేళ్లలో ఎంతో అభివృద్ధి చేసి చూపారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. మండలంలోని వెదుళ్లచెరువు, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీలలో గురువారం సాయంత్రం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. 30ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని శ్రీకాళహస్తిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తన భర్తను మరోసారి ఎన్నికల్లో ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తారని అన్నారు. కరోనా కష్టకాలంలో ఎమ్మెల్యే ప్రాణాలను సైతం పణంగా పెట్టి నియోజకవర్గ ప్రజలకు అన్నీ తానై సేవ చేశారని గుర్తు చేశారు. కష్టకాలంలో పక్కరాష్ట్రాల్లో దాక్కున్నవారంతా ఇప్పుడు వచ్చి మోసపూరిత మాటలతో ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు చేయలేదని, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా నవరత్నాలు అందిస్తున్నారన్నారు. ఈ పాలనలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. తొలుత గ్రామ సర్పంచ్ శోభ ఆధ్వర్యంలో మహిళలు ఘనస్వాగతం పలికి కర్పూర హారతులు పట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, గిరిరెడ్డి, వైస్ సర్పంచ్ కేశవులు, సుదర్శన్, చెంగయ్య, చెంగల్రాయులు, మల్లి, తిరుమలేష్, గురవయ్య, యోగేశ్వరరెడ్డి, సందీప్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు గుండాల కాల్వలో ప్రచారం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి శుక్రవారం సాయంత్రం మండలంలోని కరకంబాడి పంచాయతీ గుండాలకాల్వ, సీఆర్‌నగర్, చైతన్యపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ తెలిపారు.

జగనన్న కోసం మేము సిద్ధం



జెండాలతో పార్టీ నాయకులు

నారాయణవనం: జగనన్నను మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. నారాయణవనంలోని-1 సచివాలయ పరిధిలో గురువారం ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సీనియర్ నేత అన్నాదొరై ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా జగనన్నే రావాలని ప్రజలు గట్టిగా కోరుకుంటున్నారని అన్నారు. అర్హత ఉన్న కార్మికులందరికీ నేతన్న నేస్తాన్ని, వైఎస్సార్ పింఛన్ కానుకను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిందని అన్నారు. మరమగ్గ కార్మికుల మేలు కోరే జగనన్నకు అండగా ఉంటూ రాబోవు ఎన్నికల్లో సత్యవేడు ఎమ్మెల్యేగా నూకతోటి రాజేష్‌కు, తిరుపతి ఎంపీగా గురుమూర్తికి సచివాలయ పరిధిలో అత్యధిక మెజార్టీని తీసుకొస్తామని పేర్కొన్నారు. సింగిల్‌విండో డైరెక్టర్ మనోహర్, కోన ఆలయ కమిటీ సభ్యుడు ఢిల్లీబాబు, వీఏకే పాళ్యం సర్పంచ్ ధర్మలింగం, పళణి, గోవిందస్వామి, పార్థివన్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి లైట్లు



వీధిలో వెలగని వీధి లైట్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామంలోని పలు వీధుల్లోని వీధి దీపాలు వెలగకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు మరమ్మతుకు గురై నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీకి పన్నుల రూపంలో లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్నా కనీసం వీధి దీపాల మరమ్మతులు చేపట్టకపోవడం దారుణమంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

‘బోరు’మంటోంది!



మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ ఎస్సీ కాలనీలోని తాగునీటి చేతిపంపు మరమ్మతులకు గురి కావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం కిలోమీటరు దూరంలో ఉన్న వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లి నీటిని తెచ్చుకొంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చుచేసి వేసిన చేతిపంపు నిరుపయోగంగా మారింది. చేతిపంపు మరమ్మతులకు సంవత్సరం కావస్తున్న అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పుట్టుకతోనే మానవ హక్కులు



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

ఏర్పేడు: మనుషులంతా ఒక్కటేనని, మనిషి పుట్టుకతోనే మానవ హక్కులు సంక్రమిస్తాయని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి మార్తాల రవిబాబు అన్నారు. గురువారం మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మానవహక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కుల, మత, వర్ణ, లింగ, భాష, ప్రాంతీయ భేదాలతో మానవ హక్కులకు భంగం వాటిల్లుతోందని, అసమానతలు తొలగాలంటే ప్రాథమిక స్థాయి నుంచి బాలలు, మానవ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, నాగరాజు, గోవిందరాజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం



గ్రామోత్సవంలో స్వామి అమ్మవార్లు

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎన్ పల్లెలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా గురువారం వసంతోత్సవం వైభవంగా జరిగింది. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో స్వామిఅమ్మవార్లు ఊరేగింపుగా రాగా భక్తులు కర్పూర హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు యన్నం విజయభాస్కర్, యన్నం త్యాగరాయం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహా కుంభాభిషేక ఉత్సవాల్లో నూకతోటి రాజేష్

మహాకుంభాభిషేక ఉత్సవాల్లో గురువారం సత్యవేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు ఆయనకు శాలువా, పూలమాల వేసి వేద పండితులతో ఆశీర్వచనం పలికారు.

‘ది ఫ్యామిలీ స్టార్’ ట్రైలర్ విడుదల

- మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్
- హీరో విజయ్ దేవరకొండ వెల్లడి



ది ఫ్యామిలీ స్టార్ చిత్రం ట్రైలర్ విడుదల అనంతరం మాట్లాడుతున్న విజయ్ దేవరకొండ

తిరుపతి కల్చరల్: పరశురాం దర్శకత్వంలో రూపొందించిన ది ఫ్యామిలీ స్టార్ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ సినీ హీరో విజయ్ దేవరకొండ గురువారం రాత్రి పీజీఆర్ థియేటర్‌లో అభిమానుల మధ్య విడుదల చేశారు. ట్రైలర్ విడుదలను పురస్కరించుకుని రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన హీరో విజయ్ దేవరకొండకు అభిమానులు భారీ స్థాయిలో స్వాగతం పలికారు. అక్కడ నుంచి తిరుపతిలోని పీజీఆర్ థియేటర్ వరకు అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం థియేటర్‌లో అభిమానుల కేరింతల నడుమ ఆయన ట్రైలర్‌ను ఆవిష్కరించి ఆయన అభిమానులనుద్దేశించి మాట్లాడారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం ఎన్నోసార్లు తిరుపతికి వచ్చిన తాను మొదటిసారిగా సినిమా ఫంక్షన్‌కు తిరుపతికి రావడం సంతోషకరమన్నారు. ఇదే రోజు ఉదయం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేసి నేరుగా తిరుపతికి చేరుకొని శ్రీవారి పాదాల చెంత చిత్రం ట్రైలర్‌ను విడుదల చేయడం మహద్భాగ్యమన్నారు. ఇక్కడ ప్రజలు, అభిమానులు చూపిన ఆదరణ చేసి మనసు ఉప్పొంగుతోందన్నారు. ఇప్పటి వరకు గీతగోవిందం వంటి చిత్రాలు చేశానని, వీటిని అన్నింటినీ కలుపుకుని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ది ఫ్యామిలీ స్టార్ చిత్రాన్ని రూపొందించామన్నారు. కుటుంబ సమేతంగా ప్రజలంతా ఈ చిత్రాన్ని వీక్షించి ఆదరించాలని కోరారు. మళ్లీ తిరుపతిలో ఈ చిత్రం విజయోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆ నమ్మకం ఉందన్నారు. అనంతరం అభిమానులతో సెల్ఫీ దిగుతూ సందడి చేశారు. నిర్మాత దిల్‌రాజు, డిస్ట్రిబ్యూటర్, పీజీఆర్ సినిమా థియేటర్ అధినేత పాండ్రవేటి అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు.